క్లుప్తంగా

ప్రతి రైతుకు యూరియా అందిస్తాం

ఏవో కె.ప్రేమ్‌సాగర్

సాక్షి ఎఫెక్ట్

వేమూరు: ప్రతి రైతు సేవా కేంద్రం, వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా యూరియా అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏవో కె.ప్రేమ్‌సాగర్ తెలిపారు. మంగళవారం 'యూరియా కొరత.. రైతుల వెత' శీర్షికన సాక్షిలో వచ్చిన కథనంపై స్పందించిన ఆయన రైతులు కోగంటి సురేష్, గోపాలం శ్రీనివాసరావుతో మాట్లాడారు. యూరియా ప్రతి రైతు సేవా కేంద్రానికి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. సాగు చేస్తున్న ప్రతి రైతుకు యూరియా అందించే బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులు తీసుకుంటారని ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రాచూరు(భట్టిప్రోలు): ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా మంగళవారం భట్టిప్రోలు మండలం రాచూరు ఐసీఆర్‌పీఎస్ పరిధిలో కంపాక్ట్ బ్లాక్స్‌ను విజిట్ చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ ఎన్.ప్రకాష్ కుమార్ అజోల వేయడంపై రైతులకు వివరించారు. పొలం గట్లపై బంతి మొక్కలు నాటాలని సూచించారు. ద్రవ జీవామృతం పిట్టును పరిశీలించారు. జీవామృతం, నీమాస్త్రం తయారీ తదితర వాటి గురించి వివరించారు. భట్టిప్రోలులో ఏటీఎం పద్ధతిలో సాగుకు ముందుకు వచ్చిన కేఎస్‌కే ప్రిన్సిపాల్ పొలాన్ని పరిశీలించారు. వెల్లటూరులో ఐసీఆర్‌పీఎస్ రిజిస్టర్ పరిశీలన చేశారు. రైతులకు కోడిగుడ్డు ద్రావణం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీఎస్ ఇన్‌చార్జి, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు



భట్టిప్రోలు: ఉపరితల ఆవర్తన ప్రభావంతో మూడు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 7 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి చెట్లు, వైర్లు తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏపీసీపీడీసీఎల్ ఇన్‌చార్జి ఏఈ ఎం.శాంతకుమారి పర్యవేక్షణలో సిబ్బంది పనులను పూర్తి చేశారు.

నారాకోడూరు జీడీసీఎంఎస్ పాయింట్ తనిఖీ



సాక్షి ఎఫెక్ట్

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో ప్రియదర్శిని తెలిపారు. మంగళవారం సాక్షిలో ప్రచురితమైన 'యూరియా కొరత.. రైతుల వ్యథ' కథనానికి స్పందించి మండల పరిధిలోని నారాకోడూరులోని జీడీసీఎంఎస్ పాయింట్‌ను ఆమె తనిఖీ చేశారు. యూరియా నిల్వలు రైతులకు సక్రమంగా పంపిణీ చేయాలని నిర్వాహకులకు సూచించారు. మీ చెంతకే యూరియా పేరుతో అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు అందజేస్తున్నట్లు ఏవో తెలిపారు. యూరియా కొరతపై అపోహలు వీడాలన్నారు. రైతులకు అవసరం మేరకు యూరియా ఉందని, ఇప్పటి వరకు 1,400 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలో 5,300 హెక్టార్లలో వరి, 700 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని, మండలంలో 1,600–1,800 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేయటం జరిగిందన్నారు. ఇప్పటి వరకు చేబ్రోలు, నారాకోడూరులోని జీడీసీఎంఎస్, వేజండ్ల పీఏసీఎస్‌ల ద్వారా దాదాపు 1,200 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల ద్వారా 200 ట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేయటం జరిగిందన్నారు. వ్యవసాయ ఖాధికారులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేటు డీలర్లు, సొసైటీలను తనిఖీలు చేసినట్లు ఏవో ప్రియదర్శిని తెలిపారు.

ఈ రోడ్డుపై ప్రయాణం... నరకం

- కొల్లూరు సమీపంలో అధ్వానంగా తయారైన కరకట్ట రోడ్డు
- ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణించాల్సి పరిస్థితి



కొల్లూరు వద్ద గుంతలతో ప్రమాదకరంగా కరకట్ట రోడ్డు

కొల్లూరు : రహదారుల అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. కరకట్ట మార్గం ప్రయాణానికి పనికిరాని విధంగా తయారై ఆ మార్గంలో ప్రయాణం నరక ప్రాయంగా తయారైంది. తాడేపల్లి నుంచి రేపల్లె వరకు రాకపోకలు సాగించే వారికి దగ్గర మార్గంగా ఉన్న కరకట్ట కొల్లూరు సమీపంలో రెండు కిలోమీటర్ల పరిధిలో అత్యంత దారుణంగా తయారవడంతో ఈ ప్రాంతంలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. కొల్లూరు పశ్చిమ బ్యాంక్ కెనాల్ లాక్‌ల వద్ద నుంచి ఈపూరు వెళ్లే వైపు కరకట్ట రోడ్డు ధ్వంసమవడంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగించాల్సిన దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి.

- రేపల్లె నుంచి ఈ మార్గంలో నిత్యం విజయవాడకు వందలాది వాహనాలతోపాటు, ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. కరకట్ట రోడ్డులో ప్రయాణించాలంటేనే ఒళ్లు హూనం అవుతుందని ప్రజలు భయపడుతున్నారు. కొల్లూరు వద్ద కరకట్ట విస్తరణ పనులకు కోర్టు అడ్డంకులు ఏర్పడటంతో రెండు కిలోమీటర్ల మేర ఆర్‌సీ శాఖ ఆధ్వర్యంలో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రహదారి నిర్మించిన కొద్ది రోజుల వ్యవధిలోనే భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డు ఛిద్రమై ప్రయాణానికి పనికిరాని విదంగా తయారైనా ఆర్‌సీ యంత్రాంగం రహదారి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ మార్గం పరిస్థితి రోజురోజుకు తీసికట్టుగా మారుతుంది. ఓవైపు పశ్చిమ బ్యాంక్ కెనాల్, మరో వైపు భారీ అగాధం ఉండటంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు రెండు కిలోమీటర్ల పరిధిలో తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. కనీసం ఎదురొచ్చే వాహనానికి దారిచ్చేందుకు పక్కకు తప్పుకునే వెసులుబాటు కూడా లేకుండా పోవడంతో తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై అంగవైకల్యానికి గురవుతున్న ఘటనలు కోకొల్లలు ఉన్నాయి. వీటికి తోడు భారీ వాహనాలు సైతం ఎదురొచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురై పల్లపు ప్రాంతాలలోకి పల్టీలు కొడుతున్నాయి. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ఆర్‌సీ అధికారులు కరకట్ట మార్గంకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్‌సీ యంత్రాంగం తక్షణం స్పందించి కరకట్ట పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సాగునీటి వనరులపై సమగ్ర సర్వే అవసరం

రేపల్లె డిప్యూటీ గణాంక అధికారి రజని



కొల్లూరు : సేద్యం కోసం వినియోగిస్తున్న సాగునీటి వనరుల సమగ్ర సర్వే తక్షణం చేపట్టాలని రేపల్లె డిప్యూటీ గణాంక అధికారి రజని అన్నారు. మంగళవారం కొల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలో రైతులు సాగుకు నీటి వనరులు ఏ పద్ధతిలో వినియోగిస్తున్నారో వివరాలు సేకరించాలన్నారు. బోర్లు, బావులు, ఇతర పద్ధతులను వినియోగిస్తున్నారా అన్న విషయాన్ని సమగ్రంగా తెలుసుకోవాలని సూచించారు. మండలంలో బోర్లు, కాలువల ద్వారానే సాగు నీటి వినియోగం జరుగుతుందని ఆమె దృష్టికి తీసుకురావడంతో మండలంలో ఎన్ని బోర్లు ద్వారా ఎంత ఆయకట్టుకు సాగు నీరు అందుతుందో సర్వే చేపట్టి వివరాలు అందించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ నూతన కమిటీ ఎంపిక



అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన బసవమ్మ, సుజాత

కొల్లూరు: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నూతన కమిటీ ఎంపిక ప్రక్రియ ఏకగ్రీవంగా జరిగినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. మంగళవారం కొల్లూరు ప్రజా సంఘాల భవనంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియను అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.ఝాన్సీ, పి.రేఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పి.బసవమ్మ, ఎస్.సుజాతలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన కమిటీని 36 మందితో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ 2వ మహాసభ సందర్భంగా నిర్వహించిన నూతన కమిటీ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల వేతనాలు పెంచుతామని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం తక్షణం తమ హామీని అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు పనిభారం తగ్గించడంతోపాటు, కొత్త ఫోన్లను వెంటనే అందజేయాలని కోరారు. ఎఫ్ఆర్ఎస్ సమస్యగా ఉందని, ఈ విధానాన్ని తక్షణం రద్దు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చొరవ చూపాలని కోరారు. అంగన్‌వాడీలు ఎదుర్కొనే సమస్యలపై రాష్ట్ర, జిల్లా, ప్రాజెక్టు వ్యాప్త పోరాటాలకు అంగన్‌వాడీలందరూ ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీలు సతమతం అవుతున్న యాప్‌ల భారాన్ని తొలగించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.అగస్టీన్, పి.మనోజ్, బొనిగల సుబ్బారావు, అంగన్‌వాడీలు నీరజ, సావిత్రి, స్వప్న, గృహలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి, నళిని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కుట్టు శిక్షణ తరగతులు



కుట్టు మిషన్లు, ధ్రువీకరణ పత్రాలు అందచేస్తున్న నిర్వాహకులు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అద్దేపల్లిలో మహిళలకు నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ శిక్షణ కార్యక్రమాలు మూడు నెలల పాటు జూన్ 9 నుంచి సెప్టెంబర్ 9 వరకు జరిగాయి. మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా బొలిశెట్టి జయబాబు పేద మహిళలకు కుట్టు మిషన్లు ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫీసర్ (ఎస్‌బీఐ) విశ్రాంత చీఫ్ మేనేజర్ బొలిశెట్టి జయబాబు పాల్గొని మాట్లాడుతూ శిక్షణ తరగతులకు కల్నల్ డాక్టర్ కేఎస్ఎన్ రావ్ (బెంగళూరు), జయబాబు (హైదరాబాద్)లు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే శిక్షణ పొందిన మహిళలకు బీఎఫ్ఏ ద్వారా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు, ట్రైనర్ బి.నాగమణి, వంగర బాబుజీ, పసుపులేటి శివరామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



బోనస్ పంపిణీ చేస్తున్న జీడీసీసీబీ మాజీ డైరెక్టర్ చంద్రమోహన్

తెనాలిటౌన్: పాడి రైతుల సంక్షేమానికి పాల ఉత్పత్తిదారుల సంఘం కృషి చేస్తుందని జీడీసీసీబీ మాజీ డైరెక్టర్ కావూరి చంద్రమోహన్ పేర్కొన్నారు. రూరల్ మండలం గుడివాడ గ్రామంలో మంగళవారం పాడి రైతులకు సంగం డైయిరీ, పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బోనస్ పంపిణీ నిర్వహించారు. సంగం డైయిరీ మేనేజర్ బి.శ్రీకాంత్, జీడీసీసీబీ మాజీ డైరెక్టర్ కావూరి చంద్రమోహన్, పాలకేంద్రం అధ్యక్షుడు బొద్దులూరి సుబ్బారావు, గ్రామ సర్పంచ్ రాకేష్ పాల్గొని రైతులకు బోనస్ అందజేశారు. సంగం డైయిరీ నాలుగు శాతం, పాల ఉత్పత్తిదారుల సంఘం రెండు శాతం మొత్తం ఆరు శాతం బోనస్ రూ.1,69,505 లు మొత్తం 99 మందికి అందజేశారు. యడ్లపాటి వెంకట్రావు స్థాపించిన సంగం డైయిరీ దినదినాభివృద్ధి చెంది పాడి రైతులకు అభివృద్ధి పథంలో సేవలందిస్తున్నట్లు తెలిపారు. పాల ఉత్పత్తిని మరింత బలోపేతం చేయడానికి రైతులు పశు సంపదను పెంచి పోషించాలని సూచించారు. సర్పంచ్ రాకేష్ మాట్లాడుతూ పాడి రైతులను ప్రోత్సహించడానికి బోనస్ పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సందీప్‌కృష్ణ, నక్కా చిరంజీవి, పాలకేంద్రం కార్యదర్శి గరికపాటి శివశంకర్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై కన్నెర్ర



తెనాలిఅర్బన్: అనాధికారికరంగా ఏర్పాటు చేసిన సెంట్రింగ్‌ను మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం తొలగించారు. అధికారుల కథనం ప్రకారం గంగానమ్మపేటలోని భవనం వారి వీధిలో జీ+2 భవన నిర్మాణం కోసం మున్సిపల్ అధికారుల నుంచి ఓ వ్యక్తి అనుమతి తీసుకున్నారు. మంగళవారం 3వ అంతస్తు నిర్మించేందుకు సెంట్రింగ్‌ను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న టీపీవో సాంబశివరావు తన సిబ్బందితో అక్కడకు వెళ్ళి సెంట్రింగ్‌ను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణాలు జరిపేవారు తప్పనిసరిగా మున్సిపల్ అనుమతి తీసుకోవాలని సూచించారు. అలా తీసుకోని వాటిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెరుకుపల్లి: కావూరు సబ్‌స్టేషన్ నుంచి నగరం విద్యుత్ సబ్ స్టేషన్ వరకు నూతన 33 కేవీ లైను నిర్మాణం జరుగుతుందని విద్యుత్ డీఈఈ ఎన్.సురేష్ బాబు మంగళవారం తెలిపారు. చెరుకుపల్లి మండలంలోని కావూరు, నడింపల్లి, రాంబొట్ల పాలెం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని మత్తివారిపాలెం, ఆరేపల్లి, నడింపల్లి, పొన్నపల్లి, తుమ్మలపాలెం, బలుసులపాలెం కావూరు పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వేమూరు: మోదుకూరు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మోదుకూరు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ దోనేపూడి అర్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికలు ఏకగ్రీవం



తెనాలి: కూటమి పార్టీల సర్దుబాటుతో పట్టణంలోని నెం.22 ది తెనాలి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. నామినేషన్ల ప్రక్రియ తర్వాత ఎన్నికైన అభ్యర్థుల వివరాలను ఎన్నికల అధికారి కుర్రా వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఒక్కో డైరెక్టర్ పదవికి ఒక్కో నామినేషను మాత్రమే దాఖలైనందున పరిశీలన అనంతరం ఏకగ్రీవమైనట్లు తెలియజేశారు. ఎన్నికైన సభ్యులు అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, కనగాల శ్రీనివాసరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, కోట పున్నారావు, కందేపి హరిప్రసాదరావు, గడ్డిపాటి నాగయ్య, గండపనేని పూర్ణచంద్రరావు, తోట చంద్రశేఖర్, దొప్పలపూడి శ్యాంసన్, బచ్చు శ్రీనివాస్, మంగమూరి హరిప్రసాదరావు, షేక్ జిలాని. వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారు.

వీఆర్వోలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

తహసీల్దార్ జియావుల్‌హక్



పొన్నూరు: స్మార్ట్ కార్డులు, అన్నదాత సుఖీభవ, కౌలు రైతు కార్డులు, కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లు సకాలంలో పూర్తి చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ వీఆర్వోలను హెచ్చరించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలను తెలుసుకున్నారు. కొంతమంది వీఆర్వోల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అడ్డంకులు సృష్టిస్తూ సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ ఆలేటి మాధవి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి



తెనాలిఅర్బన్: గర్భిణులు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని గంగానమ్మపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి పేర్కొన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గంగానమ్మపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనతను అధిగమించేందుకు అవసరమైన మందులు వాడాలని సూచించారు. అలాగే ఎక్కువగా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం చేయించుకునేందుకు సిద్ధపడాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'అన్నదాత పోరు' విజయవంతం



రేపల్లెలో విలేకరులతో మాట్లాడుతున్న వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

వేమూరు: రైతులు, కౌలు రైతులు యూరియా కోసం అనేక ఇబ్బందులు పడుతుంటే కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం భట్టిప్రోలు మండలం వేమవరం అడ్డరోడ్డు నుంచి రైతులతో కలిసి వేమవరం నుంచి పల్లికోన మీదుగా రేపల్లె ఆర్‌డీవో కార్యాలయానికి బైక్ ర్యాలీగా వెళ్లారు. ఆర్‌డీవో రామలక్ష్మికి వరికూటి అశోక్‌బాబు, ఎమ్మెల్సీ మాధవరావు, రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్‌తో కలిసి వినతపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గాదె శివరామ కృష్ణా రెడ్డి, గోవర్ధనగిరి వెంకట నాగమల్లేశ్వర వరప్రసాద్, బొల్లిముంత ఏడుకొండలు, మద్దుల గిరిధర్, గోపాలం రాము, బొల్లెదు ప్రతాప్, దాట్ల మోహన్ రెడ్డి, గాజుల భానుప్రకాశ్, దాది సుబ్బారావు, అనపురెడ్డి రఘురామి రెడ్డి, గడ్డపాటి హేమచంద్ర శ్రీనివాస్, సుగుణ నాగమల్లేశ్వరావు, పడమటి శ్రీనివాసరావు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దు

మండల ప్రత్యేకాధికారి కె.దేవరాజు



కొల్లూరు : ఖరీఫ్ సాగుకు అవసరమైన యూరియా అందదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అందరికీ అందుతుందన్న విషయాన్ని గమనించాలని మండల ప్రత్యేకాధికారి కె.దేవరాజు అన్నారు. మంగళవారం కొల్లూరు గ్రోమోరు ఎరువుల కేంద్రంలో నిర్వహించిన యూరియా పంపిణీ కేంద్రంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా సరఫరా సమృద్ధిగా జరుగుతున్న నేపథ్యంలో రైతులందరికీ యూరియా అందించడం జరుగుతుందని, రైతులు గ్రహించి నిగ్రహంగా వ్యవహరించాలని సూచించారు. తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూరియా బస్తాలు ఎవరైనా అక్రమంగా నిల్వ చేసినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఏవో వి.నరేంద్రబాబు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. నానో యూరియా, నానో డీఏపీని రైతులు తమ పంటలకు వాడుకోవచ్చునని వివరించారు. కార్యక్రమంలో పోలీసు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఇంటి వద్ద యూరియా పంపిణీ



పెనుమర్రు గ్రామంలో టీడీపీ నాయకుడి ఇంటి వద్ద యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

వేమూరు: టీడీపీ నాయకులకు వ్యవసాయ శాఖ అధికారులు సహకరించడంతో రైతులకు టీడీపీ నాయకుల ఇంటి వద్ద యూరియా పంపిణీ చేశారు. వేమూరు మండలంలోని పెనుమర్రు గ్రామంలో రైతు సేవా కేంద్రం ఉంది. రైతు సేవా కేంద్రం వద్ద గ్రామ వ్యవసాయ సహాయకురాలి ఆధ్వర్యంలో ఎరువులు పంపిణీ చేయాలి, కానీ గ్రామంలో టీడీపీ నాయకుడి ఇంటి వద్ద పంపిణీ చేస్తున్నారు. మండలంలోని రైతు సేవా కేంద్రం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద ఎరువులు పంపిణీ చేయాల్సి ఉండగా పంపిణీ చేయడం లేదు. చావలి గ్రామంలో సాగు చేయని రైతులకు కూడా యూరియా అందజేయడం జరిగిందన్నారు. కోడిపర్రు గ్రామానికి చెందిన ఆనంద్ అనే రైతు అధికారులను నిలదీశారు. పెనుమర్రు రెవెన్యూ గ్రామం పరిధిలో వరి సాగు చేస్తున్న రైతులకు ఇవ్వాలి గానీ, వరి సాగు చేయని రైతులకు యూరియా పంపిణీ చేశారని ఆయన ఆరోపించారు. రేపల్లె ఏడీఏకు ఫిర్యాదు చేశారు. దీంతో పొలాలు సాగు చేస్తున్న రైతులకు యూరియా ఇవ్వాలి, సాగు చేయని రైతులకు ఇవ్వకూడదని ఏడీఏ వ్యవసాయ అధికారులకు సూచించారు.

చీరాల సబ్ రిజిస్ట్రార్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు

బాపట్ల: ఎస్సీల భూముల్ని మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తులకు సహకరించిన చీరాల సబ్ రిజిస్ట్రారుపై విక్టిమైజేషన్ ఎట్ ది హ్యాండ్స్ ఆఫ్ పబ్లిక్ సర్వెంట్ కింద ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని దళిత నేతలు నీలం నాగేంద్రరావు, మాచవరపు జూలియన్ జిల్లా రిజిస్ట్రారుకు ఫిర్యాదు చేశారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్ మంగళవారం జిల్లా రిజిస్ట్రారు శైలజను కలిశారు. ఈ సందర్భంగా డీఆర్‌తో మాట్లాడుతూ, 2005లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 13 మంది ఎస్సీ కులస్తులకు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కారంచేడులో 49 సెంట్ల వ్యవసాయ భూమిని భూమి కొనుగోలు పథకం కింద కొనుగోలు చేసి ఇచ్చారన్నారు. వెంటనే 13 మంది ఎస్సీ కులస్తుల నుంచి ఎస్సీ కార్పొరేషన్ తనఖా రిజిస్ట్రేషన్ చేయించుకుందన్నారు. చీరాలకు చెందిన ప్రభుత్వ టీచర్ బాబు ఎస్సీలకు అప్పు కింద భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఎస్సీ కార్పొరేషన్ తనఖాలో ఉన్న ఈ భూముల్ని అమ్మకూడదు, కొనకూడదు, రిజిస్టర్ చేయకూడదని అన్నారు. అయితే 2011లో అప్పటి చీరాల సబ్ రిజిస్ట్రారు వై.రంగారావు ఎస్సీ కార్పొరేషన్ తనఖాలో ఉన్న భూముల్ని అక్రమంగా రిజిస్టర్ చేశారన్నారు. అప్పు తిరిగి చెల్లిస్తాం, భూములు ఇవ్వాలని బాబు మాస్టర్‌ను అడుగుతుంటే అడ్డం తిరిగారన్నారు. ఎస్సీలకు ఆర్థికంగా నష్టం కలిగించిన చీరాల సబ్ రిజిస్ట్రారుపై విక్టిమైజేషన్ ఎట్ ది హ్యాండ్స్ ఆఫ్ పబ్లిక్ సర్వెంట్ ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేయించాలని నీలం నాగేంద్రరావు కోరారు. మాచవరపు జూలియన్, మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, కాకుమాను రవి జిల్లా రిజిస్ట్రారు శైలజకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టరుకు నివేదిక ఇస్తానని జిల్లా రిజిస్ట్రారు శైలజ తెలిపారు.

కమ్యూనిస్టు రచయితల సంస్మరణ



మాట్లాడుతున్న లక్కరాజు లక్ష్మణరావు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలిశాఖ ఆధ్వర్యంలో ఇక్కడి గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణలో భాగంగా మంగళవారం సాయంత్రం ప్రజా రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, నార్ల చిరంజీవిని స్మరించుకున్నారు. సభ‌కు రచయిత, ఉత్తమ ఉపాధ్యాయ లక్కరాజు లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన మద్దకూరి చంద్రం ప్రోత్సాహంతో సుంకర సత్యనారాయణ నాటి కమ్యూనిస్టు పత్రికలకు రచనలు చేశారని చెప్పారు. ప్రజానాట్యమండలికి కావాల్సిన నాటక, నాటిక, జానపద కళారూపాలను వేలాది ప్రదర్శనలిచ్చారని చెప్పారు. మరో కమ్యూనిస్టు కవి వాసిరెడ్డి భాస్కర రావుతో కలిసి మాభూమి, ముందడుగు నాటకాలు రాశారని గుర్తు చేసుకున్నారు. వీరిద్దరు సినీరంగంలోనూ పనిచేశారని చెప్పారు. ఇస్కఫ్ నాయకురాలు బెజ్జంకి నాగమణి, నటుడు బెల్లంకొండ వెంకట్, సీపీఐ సహాయ కార్యదర్శి తుంగా బాలస్వామి, బొల్లిముంత కృష్ణ, విజయసారథి, మాన్యం బద్రీనాథ్, సయ్యద్ రిహాన్‌బాషా మాట్లాడారు.

యూరియా మోతాదును తగ్గించాలి

పొన్నూరు: వరి సాగులో ధర తక్కువని 3 నుంచి 4 యూరియా బస్తాలు వినియోగిస్తున్నారని, 2 కట్టలు సరిపోతాయని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. అధికంగా యూరియా వినియోగిస్తే పురుగు ఉధృతి పెరుగుతుందని, మళ్లీ వాటిని కట్టడి చేసేందుకు పురుగు మందులు వినియోగించాల్సి వస్తుందని తెలిపారు. మంగళవారం మండలంలోని కసుకర్రు, చింతలపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. అనధికారికంగా యూరియా నిల్వ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్, సహాయకులు దుర్గమ్మ, రైతులు పాల్గొన్నారు.